

ఓటమి భయంలో మోదీ

- అందుకే మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు
- మంత్రి పొన్నం ప్రభాకర్


కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్/సుభాష్‌నగర్, ఏప్రిల్ 22: తొలిదశ లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన స్పందన చూసి ఓటమి భయంతో మోదీ మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నాడని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశానికి ఏం చేశారో చెప్పుకోలేని పరిస్థితిలో మోదీ ఉన్నారన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశ సంపద అంతా ముస్లింలకు ఇస్తారని మాట్లాడుతున్నాడని, సంపదంతా ముస్లింలకే ఇస్తే 85 శాతం హిందువులకు ఆయన ఏం లాభం చేశాడో చెప్పాలన్నారు. పాంచ్ న్యాయ్ ద్వారా దేశంలోని బడుగు బలహీన వర్గాలకు సమాన న్యాయం జరగాలని రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకుంటే దీనిని జీర్ణించుకోవడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు ఏం చేసిందో చెప్పి ప్రజలను ఓట్లు అడగాలన్నారు. బండి సంజయ్ బీజేపీ అధ్యక్ష పదవి నుంచి అవినీతి ఆరోపణలతోనే తీసేసారా లేదా చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఐదేళ్లలో ఒక పనైనా ప్రజలకు ఉపయోగపడేది చేశాడా అని ప్రశ్నించారు. బీజేపీకి సీనియర్ నాయకులు లేరని, కాంగ్రెస్ పార్టీ వెంట ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, ఎమ్మెల్యేలు అందరం ఐక్యంగా ఉన్నామన్నారు. డబ్బులతో ఓట్లు కొనుక్కోవాలనుకున్న వ్యక్తికి సంబంధించిన ఆరు కోట్ల రూపాయలను పోలీసులు పట్టుకున్నారని, ఆయన గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని, పరోక్షంగా మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఐదేళ్ల ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా పని చేసిన వినోద్‌కుమార్ ఈ నియోజకవర్గానికి ఏమి చేయలేదన్నారు. జడ్పీటీసీ స్థాయి నాయకుడిని కూడా గుర్తు పట్టడని, కనీసం చేయి కూడా కలపడని, నియంతలాగా వ్యవహరించాడని అన్నారు. ఇలాంటి వారంతా ఓట్ల కోసం వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగదా ఉండాలన్నారు. అధిష్ఠానం సూచనల మేరకే వెలిచాల రాజేందర్‌రావు కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేశారన్నారు. ప్రభుత్వాన్ని కూలగొడతా అన్నావాళ్ళకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మంగళవారం నుంచి పార్టీ ప్రచార కార్యక్రమాలు చేపట్టి అన్ని మండలాలు, గ్రామాలు తిరుగుతామన్నారు. పార్లమెంట్ పరిధిలో నాలుగు ఎమ్మెల్యే స్థానాల్లో గెలిచామని, ఉమ్మడి జిల్లాలో 13 మందికి గాను ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీకి చెందినవారేనని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు పాల్గొన్నారు.


అశ్వవాహనంపై స్వామి వారు

అశ్వవాహనంపై ఊరేగిన రాములోరు

ఇల్లందకుంట, ఏప్రిల్ 22: మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి అశ్వవాహన సేవను ఘనంగా నిర్వహించారు.అర్చకులు సాయంత్రం నిత్యవిధి, ప్రభుత్సోవం ముగింపు అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను ఘనంగా అలంకరించారు. అశ్వవాహనంపై అధిరోహించి బాజాభజంత్రీలు, మేళ తాళాలు, హనుమాన్ భక్తుల రామనామస్మరణ మధ్య ఊరేగించారు. అనంతరం దోపోత్సవం నిర్వహించారు. లక్ష్మాజిపల్లె, వంతడుపుల గ్రామాలకు చెందిన భక్తులు ఎడ్లబండ్లలో వచ్చి దోపోత్సతంలో పాల్గొన్నారు.


పల్లకిలో స్వామి వారి ఊరేగింపు

అట్టహాసంగా వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్

- పూలే మైదానం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్/సుభాష్‌నగర్, ఏప్రిల్ 22: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సీనియర్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్ వేశారు. సోమవారం ఉదయం కరీంనగర్ మార్కెట్ రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలకు



ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్‌పత్రాలు అందజేస్తున్న వెలిచాల రాజేందర్‌రావు

ప్రత్యేక పూజ చేయించారు. నామినేషన్‌కు ముందు కరీంనగర్ జ్యోతిబాపూలే మైదానానికి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ముఖ్య నేతలు ఓపెన్ టాప్ వాహనంలో బయలుదేరారు. కళాకారులు, కార్యకర్తలు, మండల స్థాయి నాయకులు కాంగ్రెస్ పార్టీ జెండాలు చేతపట్టి నినాదాలు చేస్తూ ర్యాలీగా కలెక్టరేట్ వరకు వెళ్లారు. కాంగ్రెస్ ర్యాలీ సందర్భంగా ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ స్తంభించింది. ఆయన వెంట రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ఉన్నారు.

● **కరీంనగర్‌ను కోహినూర్‌గా మార్చుతాం.**

నామినేషన్ దాఖలు అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ కరీంనగర్‌ను కోహినూర్ వజ్రంలా మార్చుతామని, కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఎంపీగా గెలిపించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని అన్నివర్గాల ప్రజలతో తనకు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. తన తండ్రి జగపతి రావుకు జిల్లా ప్రజలతో 40 సంవత్సరాల అనుబంధం ఉందన్నారు. తాను కూడా వివిద హోదాల్లో ఇక్కడి ప్రజలకు సేవ చేశానని తెలిపారు. ముఖ్యంగా కరీంనగర్‌లో మంచి నీటి విషయంలో తన తండ్రి పాత్రను ప్రజలు మర్చిపోలేదన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే అదే స్థాయిలో ప్రజల మధ్యలో ఉండి వారికి సేవ చేసుకుంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ భారత్ జోడో అంటుంటే, బీజేపీ మాత్రం భారత్ తోడో అంటుందని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్‌తో ఇప్పటికే ప్రజలు విసిగిపోయారని, మార్పులో భాగంగా తొలుత తెలంగాణలో ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అధికారంలో ఉన్న బీజేపీని గద్దె దించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఏర్పడిన మూడు నెలల్లోనే మహిళలు సంతోషంగా ఉన్నారని, మహిళల కోసం రూపొందించిన పథకాలకు మంచి స్పందన వచ్చిందన్నారు. గతంలో ఎంపీలుగా పనిచేసిన బోయినిపల్లి వినోద్‌కుమార్, బండి సంజయ్‌కుమార్ ప్రజలను చులకన భావంతో చూశారని, అందుకే వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వినోద్‌కుమార్ స్థానికుడు కాదని, కరీంనగర్‌కు వలస వచ్చాడని, తాను స్థానికుడనని అన్నారు. బండి సంజయ్‌కుమార్ ఏ వూరికి వెళ్లలేదని, ఎంపీ నిధులు ఖర్చు చేయలేదని, ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. పార్లమెంట్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల దళితుల అభ్యున్నతికి, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావాలన్నారు. బీజేపీ పాలనలో నిత్యవసర ధరలు ఆకాశానంటాయని విమర్శించాన్నారు. చేనేత వస్త్రాలపై పన్ను విధిస్తుంటే బండి సంజయ్ ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చి ప్రజా పాలన కొనసాగిస్తున్నారన్నారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రావాలంటే, ఇదే ప్రజాపాలన కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు కోడూరి సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ హుజూరాబాద్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, కరీంనగర్ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నాయకులు పులి ఆంజనేయులుగౌడ్, ఎండీ తాజుద్దీన్, నడిపెల్లి అశోక్‌రావు, వైద్యుల అంజన్‌కుమార్, వెన్న రాజమల్లయ్య, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, చెర్ల పద్మ, ఎర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేసి గోసపడుతున్నారు...

- బీజేపీకి ఓటేస్తే ఆగమై పోతారు
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బి వినోద్‌కుమార్
- వినోద్‌కుమార్‌ను గెలిస్తే డబుల్ ఇంజన్‌లా పనిచేస్తాం: ఎమ్మెల్యే 'గంగుల'

కరీంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని, ఆ పార్టీకి ఓటేసిన రాష్ట్ర ప్రజలు గోసపడుతున్నారని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా మల్యాలలో సోమవారం రోడ్‌షోలో నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఐదేళ్లలో ఒక బడి తేలేదు, ఒక గుడి తేలేదని విమర్శించారు. ఎంపీగా నియోజకవర్గ అభివృద్ధి మాట దేవు డెరుగు, ఆలయాల అభివృద్ధి కోసం ఐదు రూపాయలు కూడా తీసుకు రాలేదని అన్నారు. తెలంగాణకు 23 నవోదయ పాఠశాలలు రావలసి ఉంటే పదేళ్ల బీజేపీ పాలనలో ఒక్క పాఠశాల కూడా తేలేదని తెలిపారు. నవోదయ పాఠశాలను ఎందుకు తీసుకురాలేదని ఓట్ల కోసం వచ్చే సంజ య్‌ని నిలదీయాలని పిలుపు నిచ్చారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన ఆయన ఎంపీగా పోటీ చేస్తున్నాడని, సంజయ్‌కి కరీంనగర్ ఎంపీ పదవి పునరావాస కేంద్రమా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో సంజయ్ ఏనాడూ ప్రజా సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. తనను ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను తీసుకువస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం గారడీ మాటలు, మోసపూరిత హామీలిచ్చి మభ్యపెడుతోందని, నాలుగు నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజలకు విసుగు వచ్చిందని వినోద్‌కుమార్ అన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత హక్కుల గురించి పార్లమెంట్‌లో గళమెత్తి ప్రశ్నించే గొంతుక కావాలని, కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్ స్మార్ట్‌సిటీ తీసుకువచ్చారన్నారు. కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్ గెలిస్తే ఎమ్మెల్యేగా తాను రాష్ట్రంలో, ఎంపీగా వినోద్‌కుమార్ పార్లమెంట్‌లో పోరాడి డబుల్ ఇంజన్‌లా పనిచేసి నిధులు తెచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. కాంగ్రెస్ వచ్చిన నాలుగు నెలల్లోనే కరువు తీసుకువచ్చిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు కర్రుకాల్చి వాతపెట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీటీసీ రాంమోహన్‌రావు, సింగిల్ విండో ఛైర్మన్లు సాగర్‌రావు, మధుసూదన్‌రావు, రామలింగారెడ్డి పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా మల్యాల రోడ్ షోలో మాట్లాడుతున్న వినోద్ కుమార్

కరీంనగర్ లోక్‌సభ స్థానానికి 13 మంది నామినేషన్లు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 22: కరీంనగర్ లోక్‌సభ స్థానానికి సోమవారం 13 మంది నామినేషన్లను దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారికంగా అభ్యర్థి పేరును ప్రకటించ లేదు. అయినా కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్ వేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు నాలుగు నామినేషన్ల పత్రాలను అందజేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా చింత అనిల్‌కుమార్, ఆధార్ పార్టీ అభ్యర్థిగా తాళ్లపల్లి అరుణ, సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా గట్టు రాణా ప్రతాప్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా చిలువేరు శ్రీకాంత్, ఎంసీపీఐ అభ్యర్థిగా లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా దేవునూరి శ్రీనివాస్, బంక రాజు, అబ్బిడి బుచ్చిరెడ్డి, గవ్వల లక్ష్మి, జింక శ్రీనివాస్, బరిగె గట్టయ్య యాదవ్, ఎండీ జిషాన్ నామినేషన్లు వేశారు.

రేపటి నుంచి పాఠశాలలకు సెలవులు

- జూన్ 12న పునఃప్రారంభం



కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 22: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులను ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది. మంగళవారం అన్ని పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేస్తారు. బుధవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులను ప్రకటించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున 49 రోజులపాటు వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయి. వేసవి ఉష్ణో గ్రతలు అధికంగా ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ సెలవుల్లో పాఠశాలల్లో తరగతులను నిర్వహించవద్దని, ఎవరైనా పాఠశాలలు ఓపెన్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది.

ఆగస్టు వరకు శుభ ముహూర్తాలు లేవు..

- ఈ నెల 28 వరకే మంచి రోజులు
- వరుసగా రెండు మూఢాలు.. వాస్తు కర్తరి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 22: క్రోధి నామ సంవత్సరంలో శుభ ముహూర్తాలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఈ నెల 28వ తేదీ వరకే మంచి రోజులు ఉన్నాయి. ఆ రోజు వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది సంఖ్యలో శుభకార్యాలు జోరుగా జరుగనున్నాయి. మే 4 నుంచి జూన్ 3 వరకు సుమారు నెల రోజుల పాటు గురుమౌఢ్యం, ఏప్రిల్ 30 నుంచి జూలై 10 వరకు సుమారు రెండు నెలల పాటు శుక్రమౌఢ్యం ఉంది. శుభ ముహూర్తాలు లేని వాస్తు కర్తరి, నర్మదా నదీ పుష్కరాలు కూడా ముహూర్తాలకు అడ్డంకిగా ఉన్నాయి. కర్తరి మే 4 నుంచి ప్రారంభమై 29తో ముగుస్తోంది. కర్తరిలో ఎలాంటి శుభకార్యాలు ఆచరించరు. మే 1 నుంచి 12 రోజుల పాటు నర్మదా నదికి పుష్కరాలు ఉన్నాయి. ఈ నెలల్లోనే శూన్యమాసంగా చెప్పుకునే ఆషాఢం వస్తోంది. దీంతో సుమారు మూడు నెలలు ముహూర్తాలు లేవు. ఆగస్టు 5 నుంచిశ్రావణమాసం ప్రారంభం అవుతుండగా ఆగస్టు 8వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మంచి రోజులున్నాయి.

నేడు చిన్న హనుమాన్ జయంతి


ముస్తాబైన లేబర్‌అడ్డా భక్తాంజనేయస్వామి ఆలయం

కరీంనగర్ కల్చరల్ ఏప్రిల్ 22: చైత్ర శుద్ధ పౌర్ణమి పురస్కరిం చుకుని మంగళవారం చిన్న హను మాన్ జయంతిని జరుపుకోనున్నారు. త్రిమూర్తి స్వరూపుడైన హను మంతుడు అన్ని కార్యాల్లో విజయం సాధించాడని తెలిపే ఈ రోజును హనుమాన్ వీరోచిత, విజయయోజత్సవ దినంగా, శ్రీరాముడు ఆంజనేయున్ని ఆత్మీయ ఆలింగనం చేసుకున్న రోజుగా పేర్కొంటారు. సప్త చిరంజీవుల్లో ఒకరైన, ఉపాసనా సంబంధ దైవం హనుమను నిత్యం ఆరాధిస్తే సర్వకార్యాలు సిద్ధిస్తాయని, అపజయమనేది ఉండదని శాస్త్ర వచనం. ఈ రోజు జిల్లేడు, తమాల పత్రాలతో పూజలు, మినపవడ మాలలు, పళ్ల నైవేద్యాలుగా స్వామికి సమర్పిస్తారు. శ్రీరామ, హనుమ స్తోత్రాలను, సుందరకాండను పారాయణాలు చేయడం, హవనాలు నిర్వహించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి.

● **ఆలయాల్లో ఏర్పాట్లు..**

నగరంలోని సుమారు 90కి పైగా హనుమన్ ఆలయాల్లో అభిషేక, అర్చనలు, ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. ఆయా ఆలయాల్లో హనుమాన్ దీక్షా పరులు, భక్తుల సందడి నెలకొననుంది. ఆయా ఆలయాల్లో నిర్వాహకులు, అధికారులు, సిబ్బంది భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు.

'మట్టిని అక్రమంగా తరలిస్తున్న సంస్థపై చర్యలు తీసుకోవాలి'

సుభాష్‌నగర్, ఏప్రిల్ 22: అనుమతికి మించి మట్టిని అక్రమంగా తరలిస్తున్న సంస్థపై చర్యలు తీసుకోవాలని హుజూరాబాద్ మండలం మందాడిపల్లి మాజీ సర్పంచ్ ఆపెరల్లి ఎల్లయ్య కోరారు. సోమవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దిలీప్ బిల్డ్‌కాన్ లిమిటెడ్ సంస్థ తుమ్మనపల్లి, మందాడిపల్లి, రంగాపూర్, కొత్తపల్లి, సిర్సపల్లి గ్రామాలలోని ప్రభుత్వ భూమి నుంచి అనుమతికి మించి మట్టిని తరలిస్తోందన్నారు.

అదే సర్వే నంబరులో ప్రభుత్వం దళితులకు భూమి కేటాయించిందని, వారి భూములనుంచి కూడా మట్టిని తరలిస్తోందని తెలిపారు. పాండవుల గుట్ట, వంగల గుట్టలో బ్లాస్టింగ్ నిర్వహించడం వల్ల సమీపంలోని పంటపొలాలు, ఇళ్లు, పర్యావరణం దెబ్బతింటోందన్నారు. ప్రభుత్వం స్పందించి మట్టి తవ్వకాలను నిలిపివేయాలని కోరారు.

ఇంకుడు గుంతలతో వర్షపు నీటిని ఒడిసిపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 22: వర్షపు నీటిని వృథా పోనివ్వకుండా ప్రతీ నీటి బొట్టును ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలను నిర్మించాలని నగరపాలక సంస్థ కమిషనర్ బి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశమందిరంలో ఫంక్షన్ హాల్స్, హోటల్స్, బార్ల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో అనేక అనర్థాలు జరుగుతున్నందున ప్లాస్టిక్ రహితంగా పెళ్లిళ్లు, శుభాకార్యాలు జరిగేలా చూడాలని అన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, తాగునీటిని వృధా చేయవద్దని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీహరి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● **ప్లాస్టిక్ వినియోగంపై ఆకస్మిక తనిఖీలు**

నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరి సూపర్‌వైజర్ రాజమనోహర్, ఎన్విరాన్‌మెంటల్ అధికారి స్వామి, ఇతర సిబ్బంది దుకాణాలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లకు రూ.5,250 జరిమానా విధించారు.

పాండిచ్చేరీలో రోడ్డు ప్రమాదం

● సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి ● ఎఖీన్‌పూర్‌లో విషాదం


మనీష్ (ఫైల్)

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 21: పాండిచ్చేరిలో రోడ్డు ప్రమాదంలో కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. గ్రామానికి చెందిన చాడ రామకృష్ణ -మంజుల దంపతుల కుమారుడు మనీష్ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ కంపనీలో రెండు సంవత్సరాలుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మనీష్‌తో పాటు మరో ముగ్గురు ఉద్యోగులు చెన్నైతో పాటు పాండిచ్చేరి పట్టణాలకు కంపెనీ పనిలో వెళ్లినట్లు తెలిసింది. చెన్నై నుంచి పాండిచ్చేరికి కారులో మిగితా ఉద్యోగులతో కలిసి వెలుతుండగా రోడ్డు ప్రమాదం జరిగినట్లు మనీష్ బంధువులు తెలిపారు. ప్రమాదంలో మనీష్‌తో పాటు మరో ఉద్యోగి మృతి చెందంగా మిగితా ఇద్దరి గాయాలైనట్లు వారు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో దీంతో ఎఖీన్‌పూర్ గ్రామంలో విషాదం అలుముకుంది.

జమ్మికుంటలో 15లక్షల నగదు పట్టివేత


జమ్మికుంటలో నగదు చూపిస్తున్న ఏసీపీ

జమ్మికుంట, ఏప్రిల్ 22: జమ్మికుంట పట్టణంలోని గ్రేన్ మార్కెట్ రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.15లక్షల నగదు పట్టుబడినట్లు హుజూరాబాద్ ఏసిపి శ్రీనివాస్‌జీ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టుబడిన నగదు వివరాలను ఏసిపి వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన పొనగంటి సురేష్ అనే వ్యక్తి రూ.15లక్షలు నగదు తీసుకు వస్తుండగా పట్టుకున్నారు. పోలీస్‌లు నగదు స్వాధీనం చేసుకోని సీజ్ చేశారు. నగదుకు సంభందించిన ఆధారాలు లేక పోవడం వల్లే సీజ్ చేసినట్లు ఏసిపి తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ వరంగంటి రవి, సిబ్బంది పాల్గొన్నారు. పోలీసుల తనిఖీలు.....రూ. 3 లక్షల పట్టివేత

చందుర్తి : చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వేములవాడ పట్టణానికి చెందిన రేగుల రజనీకాంత్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.3 లక్షల రూపాయలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పట్టుకున్న 3 లక్షల రూపాయలను సీజ్ చేసి, ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

అదుపు తప్పి వాహనం బోల్తా

● ఇద్దరికీ తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉన్న మూలమలుపు వద్ద సోమవారం ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో మండల కేంద్రానికి చెందిన సమీర్, ఎల్లంరెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గ్రామంలోని సాయికుమార్‌కు చెందిన వాహనాన్ని మరమ్మతు చేయించడం కోసం సమీర్, ఎల్లంరెడ్డిలు కలిసి సిరిసిల్లకు బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో వాహనం అదుపు తప్పి పల్టీకొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ధర్మారం, ఏప్రిల్ 22: మండలంలోని నందిమేడారం గ్రామంలో మేడారం సత్తయ్యకు చెందిన గుడిసె షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం దగ్ధమైంది. గుడిసెలో ఉన్న 10క్వింటాళ్ల బియ్యం, నిల్వ ఉన్న ధాన్యం, దుస్తులు దగ్ధమయ్యాయి. సంఘటన స్థలానికి పెద్దపల్లి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. నిరుపేద కుటుంబానికి చెందిన సత్తయ్యకు ఆర్థిక సహాయం అందజేయాలని స్థానికులు కోరారు. సంఘటన స్థలానికి ఎంఆర్ఐ వరలక్ష్మి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 22: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బోంగోని చంద్రశేఖర్ సోమవారం ఈతచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా నడుంకు కట్టుకున్న బెల్ట్ తెగడంతో చెట్టు పైనుంచి జారి కిందపడటంతో గాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సబ్బితం గౌడ సంఘం సభ్యులు కోరారు.

తాటిచెట్టు పైనుంచి జారిపడి ఒకరు..

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాకు చెందిన వ్యక్తి ధరావత్ తిరుపతి ప్రమాదవశాత్తు సోమవారం తాటి చెట్టుపై నుంచి జారి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. చుట్టు పక్కల వారు గమనించి 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని తిరుపతి తాటి ముంజల కోసం తాటి చెట్టు పైకి ఎక్కాడు. ముంజులు కోస్తున్న క్రమంలో కాలు జారి కింద పడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల తాటి ముంజల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు పలువురు కింద పడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. తిమ్మాపూర్‌లోని బీమరి దేవయ్య తాటి చెట్టుపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తాటి చెట్టు ఎక్కడంలో అనుభవం లేకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

వీర్నపల్లి, ఏప్రిల్ 22 ఆనారోగ్యంతో బాధపడుతన్న ఓ మహిళ గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీర్నపల్లి మండలం మద్దిమల్లకు చెందిన పాట్ల సుజాత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. సోమవారం కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కొండగట్టుకు తరలివస్తున్న హనుమాన్ భక్తులు



కొండగట్టుకు తరలివస్తున్న హనుమాన్ దీక్షాపరులు



ముడుపు కడుతున్న భక్తులు



కొండగట్టులో హనుమాన్ దీక్షాపరులు

● నేడు చిన్న హనుమాన్ జయంతి

మల్యాల, ఏప్రిల్ 22: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి దీక్షాపరులు కొండగట్టుకు తరలివస్తూ స్వామి వారిని దర్శించుకుని మాలవిరమణ చేస్తున్నారు. వేకువజామున వేలాదిగా భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల కోసం భక్తులు, అంజన్న దీక్షాపరులు వాహనాలు, కాలి నడకన కొండగట్టుకు తరలివస్తున్నారు. కాగా మంగళవారం చిన్న జయంతి కోసం సాయంత్రం నుంచి భక్తుల రద్దీ పెరిగింది. వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జయంతి ఉత్సవాల ప్రత్యేక అధికారి, వేములవాడ ఈవో కృష్ణప్రసాద్, ఈవో చంద్రశేఖర్, మల్యాల సీఐ నీలం రవి నిరంతరం కొండపైన పర్యవేక్షిస్తున్నారు.



భక్తుల మాల విరమణ

అంజన్న దీక్షాపరులు హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారి సన్నిధిలో మాల విరమణ చేస్తారు. మాల విరమణ కోసం కల్యాణకట్టలో మండపం ఏర్పాటు చేశారు. ఇందులోనే భక్తులు మాల విరమణ చేస్తున్నారు. కల్యాణకట్ట వద్ద ఓ భక్తుడు తలనీలాలు సమర్పిస్తున్న క్రమంలో క్షురకుడు, ఆలయ సెక్యూరిటీ సిబ్బంది మధ్య గొడవ జరిగింది. అధికారులు, సిబ్బంది ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

● ఉచిత బస్సు సౌకర్యం

కొండగట్టుకు వస్తున్న భక్తుల వాహనాలకు జెఎన్‌టీయూ మార్గంలోని బొజ్జ పోతన వద్ద పార్కింగ్ ఏర్పాటు చేయగా అక్కడి నుంచి ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ఉచిత బస్ సౌకర్యం ఏర్పాటు చేసింది. వివిధ ప్రాంతాల నుంచి తండోపతండాలుగా దీక్షాపరులు కొండగట్టుకు తరలివస్తుండడంతో కొండంతా కాషాయమయంగా మారుతుంది. రామనామంతో అంజన్న సన్నిధి పులకిస్తోంది

ఆంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం హనుమాన్ చిన్న జయంతిని దేవస్థానం తరుపున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్తర భారత దేశంలో ప్రతియేటా చైత్ర పౌర్ణమి రోజున హనుమాన్ జయంతిని నిర్వహించనుండగా ఇక్కడ కూడా అదే రోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి అభిషేకం, పట్టువస్త్రలంకరణ చేశారు.



మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు



ధర్మగుండంలో స్నానం చేస్తున్న భక్తులు

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు : కలెక్టర్



కొండగట్టులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

మల్యాల, ఏప్రిల్ 22: కొండగట్టులో జరుగుతున్న చిన్నహనుమాన్ జయంతి వేడుకలకు భక్తులకు ఎలాంటి సమస్యలు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్ యాస్మీన్ భాష తెలిపారు. కొండపైన జయంతి ఏర్పాట్లను సోమవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులు తమ దీక్షను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. భక్తులకు సరిపడా టికెట్ కౌంటర్లు తదితరవి ఏర్పాటు చేయగా 114 సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారుకులకు భక్తుల కోసం తీసుకోవల్సిన సౌకర్యాలపై పలు సూచనలు చేశారు. దేవస్థానం అధికారుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్, డిఎస్పీ రఘుచందర్, ఆలయ ఈవో చంద్రశేఖర్, ప్రత్యేక అధికారి కృష్ణప్రసాద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 32మంది రైతులు 501క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.5,500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కొండగట్టుకు పాదయాత్ర చేపట్టిన భక్తులు జాగ్రత్తలు పాటించాలి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 22: కొండగట్టుకు పాదయాత్ర చేపట్టిన భక్తులు జాగ్రత్తలు పాటించాలని జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ పేర్కొన్నారు. హన్‌మాన్ జయంతి ఉత్సవాలను పురష్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి కొండగట్టు ఆలయం వరకు కాలినడకన వెళ్లే భక్తులకు రేడియం స్టిక్కర్ల ద్వారా రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. సోమవారం జగిత్యాల మండలం తిప్పన్నపేట స్టేజీ వద్ద కాలినడకన కొండగట్టు వెళ్తున్న భక్తులకు రేడియం స్టిక్కర్లను అతికించారు.

కేసీఆర్ నియంత పాలనతోనే అధికారంలోకి కాంగ్రెస్

● పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కేటాయించని కాంగ్రెస్ ● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

హుజూరాబాద్, ఏప్రిల్ 22: కేసీఆర్ కుటుంబ నియంత పాలనతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందే తప్ప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వల్ల కాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్లలో కేసీఆర్ కుటుంబం అనేక అక్రమాలు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగల అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా అదే సమయంలో బీసీలను రాజకీయంగా అణగదొక్కుతున్నాడన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలను ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్ అధిష్టానానికి కానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేదన్నారు. కాంగ్రెస్ దృష్టిలో దళితులంటే మాలలు అయినప్పుడు మాదిగల ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికంగా రెడ్డి సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలిచే సీట్లు అగ్రకులాలకు ఇస్తూ ఓడిపోయే సీట్లు బీసీలకు కేటాయించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి ముస్లింలకు ఇస్తే, రేవంత్‌రెడ్డి హయాంలో ఒక్క మంత్రి పదవి కూడా ముస్లింలకు ఇవ్వలేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ బీజేపీకి మద్దతు ఇస్తుందన్నారు. ముస్లింలు బీజేపీ పార్టీని వ్యతిరేకించవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు చేసేది ఏం లేదన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆర్ రామచంద్రం, ఎం శ్రీనివాస్, టి వసంత్, వెంకటస్వామి, బి అనిల్, ఆర్ సాగర్, డి రవీందర్, అంజయ్య, టి రాజు, బి సారయ్య, ఆర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పాత కక్షలతో కుటుంబంపై దాడి

● వాహనాలు ధ్వంసం
● ముగ్గురికి తీవ్ర గాయాలు

కోనరావుపేట, ఏప్రిల్ 22: పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఒక కుటుంబంపై రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులు దాడి చేయగా ముగ్గురికి తీవ్ర గాయాల య్యాయి. వారి వాహనాలను ధ్వంసం చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెంది న కుతాడి బాబు కుటుంబానికి, లోకిని ఎల్లవ్వ, ప్రశాంత్ కుటుంబాలతో పాతకక్షలు ఉన్నాయి. 15 రోజుల క్రితం కుతాడి బాబు తమ ఇంట్లో చొరబడి రూ. 50 వేలు ఎత్తుకెళ్లాడని, ఎల్లవ్వ మెడలోని పుస్తెలతాడు దొంగతనానికి ప్రయత్నించాడని కోనరావుపేట పోలీసులకు ఎల్లవ్వ కుమారుడు సతీష్ ఫిర్యాదు చేశాడు. ఈ క్రమం లో ఆదివారం రాత్రి కుతాడి బాబు, అతని తండ్రి కనక య్య, భార్య శిరీష కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో భోజనం చేస్తుండగా లోకిని సతీష్, లోకిని ప్రశాంత్, లోకిని దేవయ్యలతో పాటు వారి కుటుంబసభ్యులు కారంపొడి, గొడ్డళ్లతో, కర్రలతో వచ్చి మహిళలు బాబు కుటుంబ సభ్యులపై కారంపొడి చల్లగా గొడ్డళ్లతో దాడి చేశారు. వారి ఇంటి వద్ద ఉన్న కారు, ట్రాక్టర్, ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. బాబు తండ్రి కనకయ్యకు తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు ప్రాణభయంతో పరుగులు తీశారు. స్నేహితుల సహాయంతో సిరిసిల్ల హాస్పిటల్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజనేయులు హాస్పిటల్ వెళ్లి బాధితులను పరిశీలించి వివరాలను సేకరించారు. అనంతరం ధర్మారం గ్రామంలో జరిగిన ఘటన స్థలాన్ని పరిశీలించారు. కుతాడి బాబు ఫిర్యాదు మేరకు లోకిని సతీష్, ప్రశాంత్, దేవయ్యలతో పాటు వారి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : భార్యా భర్తలకు గాయాలు

● పోలీసులు పట్టుకుంటారనే భయంతో ట్రాక్టర్‌ను వేగంగా నడిపిన డ్రైవర్

రామడుగు, ఏప్రిల్ 22: పోలీసులు వెంటపడుతుండగా ట్రాక్టర్‌ను వేగంగా నడిపిన డ్రైవర్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు అతని భార్యకు తీవ్రగాయాలయ్యాయి. రామడుగు మండలంలోని గుండి గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. రామడుగు మండల కేంద్రానికి చెందిన బత్తిని రవి, కవితలు వడ్డెర కులస్థులు. బతుకుదెరువు కోసం ట్రాక్టర్ నడుపుకుంటూ జీవిస్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున రామడుగు వాగు నుంచి ఇసుకను భార్యా భర్తలు ఇద్దరు ట్రాక్టర్ లోడు చేసుకొని గోపాల్‌రావుపేట్‌లో నిర్మాణం జరుగుతున్న స్థలానికి తరలిస్తున్నారు. గోపాల్‌రావుపేట్ బస్టాండ్ సమీపానికి చేరుకునేసరికి తెల్లవారు జామున జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసులు ఇన్నోవా వాహనంలో ఓ కానిస్టేబుల్ డ్రైవర్‌తో పాటు గస్తీ నిర్వహిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకునేందుకు పోలీసులు వెంటపడగా ట్రాక్టర్‌లో ఉన్న డ్రైవర్ రవి, తన భార్య కవితలు భయంతో ట్రాక్టర్‌ను వెనుకకు మలుపుకొని వేగంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో గుండి గ్రామపంచాయతీ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి ఇసుకలోడుతో సహ పిల్ల కాల్వలోకి దూసుకెల్లి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటనలో భార్యా భర్తలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.



గుండిలో బోల్తాపడ్డ ట్రాక్టర్

కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

● నూతన వధూవరులతో సహా ఐదుగురికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 22 : కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలోని గట్టుదుద్దెనపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులోకి కారు దూసుకెళ్లిన సంఘటనలో నూతన వధూవరులతో సహా ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. హన్మకొండకు చెందిన దామెర తిలక్ (36), స్వాతిల వివాహం ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగింది. సోమవారం నూతన వధూవరులు, వరుడి తల్లిదండ్రులు దామెర సురేందర్ (65), దామెర కౌసల్య (55)తో పాటు పెళ్లి కూతురు చెల్లెలు విద్య(20)లు కలిసి ఓకే కారులో ఐదుగురు హన్మకొండకు బయలు దేరారు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారిపై పనులు నడుస్తుండగా నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులోకి కారు దూసుకపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్రగాయాలు కాగా కారు నుజ్జునుజ్జు అయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజుకుమార్ తెలిపారు.



కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

నర్సరీలో అగ్ని ప్రమాదం

తిమ్మాపూర్, ఏప్రిల్22: తిమ్మాపూర్ మండల కేంద్రంలో రాజీవ్ రహదారికి సమీపంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వెనుకాల గల తెలంగాణ వెజిటెబుల్ నర్సరీలో సోమవారం ఉదయం మంటలు చెలరేగాయి. గమనించిన నర్సరీ యాజమని, అందులో పనిచేసే వారు అక్కడికి చేరుకుని మంటలను నివారించేందుకు చాలాసేపు శ్రమపడ్డారు. ఎగిసిపడుతున్న మంటలపై నీటిని చల్లారు. ఈ విషయంపై నర్సరీ యాజమని ఆశా కిరణ్‌ను అడుగగా ట్రేలు ఒకే చోట ఉండటం వల్ల ఎండ వేడిమికి మంటలు అంటుకొని ఉండవచ్చన్నారు. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు 3వేలకు పైగా ప్లాస్టిక్ ట్రేలు, డ్రిప్ సిస్టం పైపులు, గ్రీన్ షెడ్ నెట్ కలిసి సుమారు 4లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని, అధికారులు స్పందించి ఆదుకోవాలని సంఘటన స్థలానికి వచ్చిన తహసీల్దార్ కనకయ్యకు నర్సరీ నిర్వాహకులు విన్నవించారు.



నర్సరీలో మంటలను ఆర్పుతున్న స్థానికులు

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ

● ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 22 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో మోటార్ సైకిల్‌ను సోమవారం లారీ ఢీకొన్న ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన తాల్లపల్లి సంపత్ అనే వ్యక్తి తన మోటార్‌సైకిల్‌పై గట్టుదుద్దెనపల్లి పెట్రోల్ బంక్‌కు వెళ్లి తిరిగి వన్నారం గ్రామానికి వెళ్తున్నాడు. ఓ లారీ కరీంనగర్ నుంచి వరంగల్ పైపు వెళ్తుండగా మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంపత్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు వసతుల కల్పన



మాట్లాడుతున్న శరత్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 22: జిల్లాలో టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు వసతుల కల్పనకు కృషి చేస్తామని జిల్లా టేబుల్ టెన్నిస్ నూతన కార్యవర్గ అధ్యక్షుడు డాక్టర్ జి శరత్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జీఎస్ అకాడమిలో జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు టేబుల్ టెన్నిస్‌లో రాణించాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ శరత్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీధర్‌గౌడ్, మహేష్, మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా సర్దార్ సురేందర్‌సింగ్, సంయుక్త కార్యదర్శిగా వికాస్‌కుమార్, కోశాధికారిగా గౌతంరెడ్డి, నిర్వహణ కమిటీ సభ్యులుగా రజనీకాంత్‌రెడ్డి, సంతోష్, శ్రీహర్ష, శ్రీకర్‌చారి, నియామకయ్యారు. నూతన కార్యవర్గాన్ని డివైఎస్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి, ఒలింపిక్ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డిలు అభినందించారు.

బిర్లా స్కూల్‌లో క్రికెట్ అకాడమీ ప్రారంభం


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్22: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని బిర్లా స్కూల్‌లో సోమవారం అధికారికంగా రోహిత్‌శర్మ క్రికెట్ అకాడమీని ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా బిర్లా స్కూల్లో రోహిత్‌శర్మ క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేశామని అన్నారు. జాతీయ స్థాయి కోచ్‌లతో అద్భుతమైన శిక్షణ కేంద్రంగా ఈ అకాడమీ నిలువనుందని అన్నారు. క్రీడలలో విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి వేసవికాల క్రీడా శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఆర్చరీ, స్కేటింగ్, బాస్కెట్‌బాల్, లాన్ టెన్నిస్ క్రీడలను ఏర్పాటు చేశామని దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆసక్తి గల క్రీడాకారులు, విద్యార్థులు ఎవరైనా వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోగలరని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్‌ను గెలిపించండి'


మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 22: దేశంలో ప్రజాస్వామ్య రక్షణ కోసం ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే ప్రజలు గెలిపించాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. సోమవారం నగరంలోని కార్యాలయంలో చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రజామిత్రతో పాటు అన్ని ప్రజాసంఘాలు, కులసంఘాలు కలిసి పనిచేయాలన్నారు. ఈదేశానికి రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గేల నాయకత్వం అవసరముందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ చాలా ప్రతిష్ఠాత్మకమైందని, కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశ అభివృద్ధిని ఆకాంక్షించే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిగిరి శ్రీధర్, తరాల్ల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలను సందర్శించిన ఏసీపీ


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 22: జమ్మికుంట మండలంలోని సమస్యాత్మక గ్రామాలను హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, సీఐ వరంగంటి రవిలు సోమవారం సందర్శించారు. సైదాబాద్, కోరపల్లి, విలాసాగర్, తనుగుల, వావిలాల గ్రామలను సిఐఎస్‌ఎఫ్ బలగాలతో పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఏమైనా సమస్యలు ఉన్నాయా అని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఏసిపి శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

'భారీ మెజారిటీతో బండి సంజయ్‌ని గెలిపించాలి'

తిమ్మాపూర్, ఏప్రిల్22: గతంలో కంటే భారీ మెజారిటీతో బీజేపీ ఎంపి అభ్యర్థి బండి సంజయ్‌ను గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల అంజనేయులు, ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి కోరారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో సోమవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీరు హాజరై మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల కోసం పోటీపడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు రాజకీయ పురావాసం కోరే అవకాశవాదులేనని ఆరోపించారు. గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీకి ఆదరణ లేదని కేవలం ఉనికి కోసమే పోరాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఏనాడూ ప్రజాక్షేత్రంతో సంబంధం లేదని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత బీజేపీ కార్యకర్తలదేనని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, నాయకులు కళ్యాణ్‌చంద్ర, మావురపు సంపత్, బూట్ల శ్రీనివాస్, చింతం శ్రీనివాస్, కిన్నెర అనిల్, తిరుపతి రెడ్డి, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం


గన్నేరువరంలోని ఐకెపి సెంటర్‌లో తడిసిన ధాన్యం ఆరబెడుతున్న రైతు

గన్నేరువరం, ఏప్రిల్ 22 : మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్‌లో తూకానికి సిద్ధంగా ఉన్న వరిధాన్యం కుప్పలు, ఆరబోసిన వడ్లు సోమవారం తెల్లవారు జామున కురిసిన అకాల వర్షానికి తడిసిపోయాయి. ఎప్పుడు వర్షం కురుస్తుందో ఎప్పుడు ధాన్యం తడిసిపోతుందో తెలియక వడ్ల కుప్పల వద్ద రైతులు రాత్రి పగలనక నిరీక్షిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు తిప్పలు పడుతున్నారు. సెంటర్లలో కొనుగోళ్లలో వేగం పెంచాలని రైతులు కోరుతున్నారు.

కాలుష్యం నుంచి ధరిత్రిని కాపాడుకుందాం



ర్యాలీ నిర్వహిస్తున్న సర్వోదయ సేవాసమితి బాధ్యులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 22: భూమాతను కాలుష్య కోరల నుంచి కాపాడుకుందామని పర్యావరణవేత్త తోట లక్ష్మణరావు అన్నారు. సోమవారం ధరిత్రి దినోత్సవం సందర్భంగా స్థానిక లయోలా కళాశాల ప్రాంగణంలో సర్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్యారీ బ్యాగుల వాడకాన్ని మానుకోవాలన్నారు. ప్లాస్టిక్ బ్యాగులతో క్యాన్సర్ వంటి వ్యాధులు సోకే ప్రమాదముందని అన్నారు. గాలి ద్వారా పంట పొలాలపై ప్లాస్టిక్ కణాల ప్రభావంతో పంట దిగుబడులు కూడా తగ్గుతున్నాయని పేర్కొన్నారు. సంస్థ అధ్య క్షుడు పెద్ది లక్ష్మీనారాయణ ర్యాలీని ప్రారంభించి మాట్లా డుతూ పర్యావరణ హితమైన బట్ట, జనుప సంచులు మాత్రమే వాడాలని అన్నారు. కార్యక్ర మంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్ది లక్ష్మీనారాయణ, సామ నారాయణ, కోశాధికారి కొమురవెల్లి వేంకటేశం, ఉపాధ్యక్షులు కల్యాకరి సుధాకర్, జంధ్యం మధుకర్, గంగిశెట్టి సత్యనారాయణతో పాటు ఇన్నారెడ్డి, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

●**కరీంనగర్ రూరల్:** నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సమత ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వ్యాసరచన, ఉపవ్యాస పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, కెమిస్ట్రీ హెచ్‌ఓడీ ఎస్ సుష్మ పాల్గొన్నారు.

●**కరీంనగర్ స్పోర్ట్స్:** నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో వాకర్స్, యోగా వికాస్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మట్టిని కాపాడుకుందాం.. ఆరోగ్యంగా జీవిద్దాం.. అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ డిప్యూటి గవర్నర్ గుడిపాటి రమణారెడ్డి, జోనల్ చైర్‌పర్సన్ పెంచాల కిషన్‌రావు, యోగా కోచ్ కిష్టయ్య చంద్రన్న, శ్రీధర్, గంగరాజు, పొన్నం రాజు, అడెపు కమలాకర్, డాక్టర్ బాలరత్నం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల వార్‌రూం ప్రారంభం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్22: డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వార్‌రూంను సోమవారం రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలు ప్రారంభించారు. ఈ వార్‌రూం ద్వారా కాంగ్రెస్‌పార్టీకి సంబంధించిన ఎన్నికల వ్యవహారాలు, ఫిర్యాదులు, సూచనలు, సలహాలు, అభిప్రాయాలను స్వీకరించనున్నారు. ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ అధిష్టానం అందజేసిన సమాచారాన్ని క్షేత్రస్థాయి వరకు కార్యకర్తలకు చేరవేయటం, తద్వారా కార్యకర్తల ఫలితాన్ని పర్యవేక్షించటం తదితర అంశాలపై వార్‌రూంలో కార్యచరణ రూపొందిస్తారు. బూత్‌స్థాయిలో కమిటీ సభ్యులు, నిర్వహించాల్సిన ప్రచార సరళిపై వారికి వార్ రూం ద్వారా ప్రచార సామగ్రి, ఏఐసీసీ ద్వారా వచ్చిన 3లక్షల న్యాయ్‌గ్యారంటీ కార్డులను అందజేస్తామని వార్‌రూం ఇంచార్జి పవన్ మల్లాడి తెలిపారు. ఈ సందర్భంగా హుస్నాబాద్, మానకొండూర్, కరీంనగర్ మండలాలకు చెందిన కాంగ్రెస్‌పార్టీ మండలం, బ్లాక్, పట్టణ అధ్యక్షులతో వార్‌రూంలో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులకు పవన్ మల్లాడి దిశా నిర్దేశం చేశారు.

'ప్రభుత్వ భూముల కబ్జాను అడ్డుకున్న కలెక్టర్‌కు ధన్యవాదాలు'

కరీంనగర్ రూరల్, ఏప్రిల్22: కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ గ్రామంలోని ప్రభుత్వ భూమి కబ్జాదారులకు కళ్లెం వేసిన కలెక్టర్ పమేలా సత్పతికి తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమర్‌నాథ్ ధన్యవాదాలు తెలిపారు. నగునూర్ గ్రామంలోని సర్వే నెంబర్669లో 26ఎకరాల 8గుంటల ప్రభుత్వ బంచరాయి భూమి ఉందన్నారు. ఈ ప్రభుత్వ భూమిలో కొందరు చట్ట విరుద్ధంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకున్న కారణంగా తను అక్రమ రికార్డులపై రెవెన్యూ అధికారులపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీంతో ఆ భూమిని నిషేధిత జాబితాలో చేర్చారని తెలిపారు. ఈ స్థలంలో అసలైన ఎస్సీ కులానికి చెందిన గడప కాంతమ్మ భూమిని ఆమెకు ఇప్పించి మిగతా భూమి ఎస్సీ ఎస్టీలకు నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వ స్థలాన్ని కపాడి కబ్జాదారులపై చర్యలు చేపట్టినందుకు కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్‌డిఓ పవన్‌కుమార్, మహేశ్వర్, తహశీల్దార్ నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్, జిల్లెల విజయ్‌కుమార్, శ్రీకాంత్, కీర్తికుమార్, చెంచాల మురళి ఉన్నారు.

చదరంగంలో క్రీడాకారుడి ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్22: అంతర్జాతీయ చదరంగంలో ఫిడే క్యాండిటెడ్ పోటీల్లో విజేతగా నిలిచి అంతర్జాతీయ క్రీడాకారుడిగా నిలిచిన గుకేష్‌కు అభినందనలు తెలుపుతూ తెలంగాణ చౌక్‌లో తెలంగాణ చెస్ డెమోక్రటిక్ సంఘం సభ్యులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లకార్డులు ప్రదర్శిస్తు బాణ సంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. డెమోక్రటిక్ చెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీనియర్ కోచ్ కంకటి అనూప్‌కుమార్ ఈసందర్భంగా మాట్లాడుతూ గుకేష్ అంతర్జాతయ చదరంగంలో విజేతగా నిలవడం దేశానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమార్, ఉపాధ్యక్షుడు వి అనూష్ కుమార్, సంయుక్త కార్యదర్శి కంకటి సృజన్, సతీష్ బాబు, కె రాజ్‌కుమార్, వెంకటేష్, 49వ డివిజన్ కార్పొరేటర్ నాగరాజు పాల్గొన్నారు.

'నిరుద్యోగులను విస్మరించిన బీజేపీ ప్రభుత్వం'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 22: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యార్థి, నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. సోమవారం ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్‌ను నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందన్నారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకువచ్చిందన్నారు. విద్య కాషాయీకరణ, ప్రైవేటీ కరణ, కార్పొరేటీకరణ చేసిన మోదీ ప్రభుత్వాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడానికి విద్యార్థి లోకాన్ని ఏకం చేస్తామన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ విద్యార్థులు, యువకుల కోసం చేసిందేమీ లేదన్నారు. కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీ ఏర్పాటుపై, యువతకు రెండు కోట్ల ఉద్యోగాల భర్తీపై బండి సంజయ్ ఏనాడు పార్లమెంట్‌లో ప్రస్తావించలేదన్నారు. విద్యను కార్పొరేటీకరణ, కాషాయికరణ చేశారని ఆరోపించారు. విద్యకు ప్రతి బడ్జెట్‌లో కనీసం పది శాతం నిధులు కూడా విడుదల చేయడం లేదన్నారు. తెలంగాణ విభజన హామీల ప్రకారం తెలంగాణకి విద్యాసంస్థలు కేటాయించకుండా మోదీ కక్షపూరితంగా వ్యవహరించారన్నారు. దేశంలో అనేక ప్రాంతాల్లో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేసిన కేంద్రం కరీంనగర్‌లో ఏర్పాటు చేయలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా బీజేపీని ఓడించడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు రాజేశ్, వినయ్‌రెడ్డి, బొల్లి సాయి, సచిన్, శ్రవణ్, అనిరుద్ తదితరులు పాల్గొన్నారు.

25న ఎన్నికల కార్యాచరణ ప్రకటిస్తాం

-తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి



మాట్లాడుతున్న బొల్లం లింగమూర్తి

గణేశ్‌నగర్,ఏప్రిల్ 22: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల కార్యచరణను ఈనెల 25న ప్రకటిస్తామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి తెలిపారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ కార్యాలయంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి కాల్వ మధుబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బొల్లం లింగమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ లోకసభ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలనే దానిపై 25న కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కరీంనగర్, మానకొండూరు, హుజూరాబాద్, హుస్నాబాద్, చొప్పదండి, సిరిసిల్ల, వేములవాడ, ఏడు నియోజకవర్గాల నాయకులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల సత్తా చూపిస్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ పెంట అజయ్ పటేల్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి అలస వేణుగోపాల్, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కందుకూరి ఆంజనేయులు, తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జరిగే కోటేశ్వర్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

● ఓబీసీ మోర్చా సమ్మేళనంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్


గర్షకుర్తిలో మాట్లాడుతున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్

గంగాధర, ఏప్రిల్ 23: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. సోమవారం గంగాధర మండలం గర్షకుర్తిలో ఓబీసీ మోర్చా సామాజిక సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో బీసీని ప్రధాన మంత్రిగా చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌ను ఈ ఎన్నికల్లో గెలిపించేందుకు సైనికుడిలా ప్రతికార్యకర్త పనిచేయాలన్నారు. బీజేపీ సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దివాకర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దూలం కల్యాణ్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి సుధారాణి, రాష్ట్ర కార్యదర్శి విజయభాస్కర్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్, నాయకులు అశోక్,దాసరి అంజి, వినయ్ సాగర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న పూజారులు

కోనేరుపల్లిలో ఘనంగా ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

చొప్పదండి, ఏప్రిల్ 22: చొప్పదండి మండలంలోని కోనేరుపల్లి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ధ్వజారోహణ వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. వేద పండితులు జగన్నాథ విష్ణు వర్ధనాచార్యుల సమక్షంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కల్యాణ మహోత్సవానికి భక్తులు భారీసంఖ్యలో హాజరయ్యారు. గ్రామస్థులు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నమాధవుని పవనసుతరాజు, ప్రధానకార్యదర్శి కలకొండ వెంకటలింగారెడ్డి, ఉపాధ్యక్షుడు కాసు వేణుగోపాల్‌రాజు, కోశాధికారి బత్తిని ఎల్లాగౌడ్, అశోక్, రామేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


డాక్టర్ నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, ఏప్రిల్ 22: హుజూరాబాద్ పట్టణంలోని ప్రముఖ వైద్యుడు డాక్టర్ ముక్క నవీన్ కుమారుడు నివేష్ అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, మృతుడి కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సోమవారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా నివేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నవీన్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, స్థానిక బీఆర్ఎస్ నాయకులున్నారు.


డాక్టర్ నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

బీజేపీ జిల్లా అధ్యక్షుడి పరామర్శ

హుజూరాబాద్, ఏప్రిల్ 22: హుజూరాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్ ముక్క నవీన్ కుమారుడు నివేష్ కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా నవీన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గంగిశెట్టి రాజు, పైళ్ల వెంకట్ రెడ్డి, బీజేపీ కార్యకర్తలు నాయకులున్నారు.

మండల సర్వసభ్య సమావేశాలు వాయిదా

కరీంనగర్ రూరల్, ఏప్రిల్22: కరీంనగర్ మండల పరిషత్‌లో సోమవారం నిర్వహించిన కరీంనగర్ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. సోమవారం ఎంపీపీ లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, సభ్యులు హాజరుకాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో సంజీవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణ, మిషన్ భగీరథ డీఈ ప్రభాకర్, ఏడీఈ సూర్యప్రకాష్, ఎంపీవో జగన్‌మోహన్, పిఆర్ఎఈ రమణారెడ్డి, ఎఓ సత్యం, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

భగత్‌నగర్, ఏప్రిల్ 22: కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఉదయం మండల పరిషత్ అధ్యక్షురాలు పిల్లి శ్రీలతమహేష్ అధ్యక్షతన ప్రారంభమైన సర్వసభ్య సమా వేశం కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ప్రభు, ఏపీవో స్పందన, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు సాబీర్, ఎంపీటీసీ దావ కమలమనోహర్ పాల్గొన్నారు.

నేడు ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్ ఏప్రిల్ 22: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 7గంటలకు రేకుర్తి సేయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి ఆతిథ్యంలో విద్యానగర్, మల్కాపూర్ రోడ్‌లోని సెయింట్‌జార్జ్ నినోస్ బ్లాక్ (సిబిఎస్‌ఈ) విభాగంలో 132వ ఎన్నీల ముచ్చట్ల సాహిత్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు సీవి కుమార్, దామర కుంట శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు తమ కవితలతో సకాలానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

మున్సిపల్ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం కన్వీనర్‌గా మహేందర్ రాకేశ్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 22: కరీంనగర్ మున్సిపల్ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం కన్వీనర్‌గా రెండవ సారి దుగ్గు మహేందర్ రాకేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సంఘ భవనంలో జరిగిన కాంట్రాక్టర్ల సమావేశంలో అయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ల సమస్యలను పాలకవర్గం, అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కాంట్రాక్టర్ల సంక్షేమానికి, పెండింగ్ బిల్లుల మంజూరీకి కృషిచేస్తానని అన్నారు. అనంతరం కాంట్రాక్టర్లతో కలిసి మేయర్ యాదగిరి సునీల్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కాంట్రాక్టర్ల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంట్రాక్టర్ల సంఘంప్రతినిధులు ఆకుల మోహన్, మదూకర్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి


ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

వీణవంక, ఏప్రిల్22: వీణవంక మండలం హిమ్మత్‌నగర్ గ్రామంలో పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్ మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతి, సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

ఇల్లందకుంట, ఏప్రిల్ 22: మండలంలోని కాంగ్రెస్ నాయకులు కరీంనగర్‌లో ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న వెలిశాల రాజేందర్ మద్దతుగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి ఆధ్వర్యంలో సోమవారం తరలివెళ్లారు. కార్యక్రమంలో పెద్ది కుమార్, మహేష్, కరుణాకర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

మాతా శిశు ఆసుపత్రికి కూలర్ అందజేత


కూలర్‌ను డాక్టర్లకు అందజేస్తున్న నాయకులు

తిమ్మాపూర్, ఏప్రిల్22: తిమ్మాపూర్ మండల వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, ఇతర నాయకుడు తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్ వారి తండ్రి జ్ఞాపకార్థంగా 35వేల రూపాయల విలువ గల కూలర్‌ను సోమవారం కరీంనగర్‌లోని మాతా శిశు ఆసుపత్రికి విరాళంగా అందజేశారు.

కాలుష్య రహిత సమాజం కోసం పాటుపడాలి



హుజూరాబాద్‌లో బట్ట సంచులపై అవగాహన కల్పిస్తున్న సామాజిక కార్యకర్త వేణుగోపాల్

హుజూరాబాద్, ఏప్రిల్ 22: భూమిని కాపాడుకునేందుకు కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్లాస్టిక్ కవర్లు వద్దు.. బట్ట సంచులు వాడాలని హుజూరాబాద్ పట్టణంలో సైకిల్‌పై తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి మట్టికి సంబంధం ఉందని, ప్రాణకోటికి ఆధారమైన భూమిని కలుషితం చేయవద్దన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకుంటేనే భూమి లోకి నీరు ఇంకి భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. భవిష్యత్ తరాల కోసం అడవులను పెంచాలన్నారు.